ఎన్ఐఏ దాడులు అనైతికం


మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వేణుగోపాల్, నార్ల రవిశర్మ తదితరులు

సుల్తాన్‌బజార్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నట్లు ప్రజాస్వామ్యం పునరుద్ధరణ జరగడం లేదని ఎన్ఐఏ దాడుల వల్ల స్పష్టమవుతుందని పౌర హక్కుల సంఘం నేతలు అభిప్రాయపడింది. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వేణుగోపాల్, నార్ల రవిశర్మలు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా మళ్లీ ఎన్ఐఏ దాడులకు పూనుకుంటోందన్నారు. ఈ నెల 8వ తేదీన తెల్లవారక ముందే వీక్షణమ్ ఎడిటర్ వేణు గోపాల్, నార్ల రవి ఇండ్లమీద దాడి చేసి సోదాలు నిర్వహించిందని వారు తెలిపారు. నేరపూరిత వస్తువుల కోసం అణువణువు గాలించి ఏమీ దొరక్క వెనుదిరిగిందని సెల్‌ఫోన్ మాత్రం ఎత్తుకెళ్లారని వారు తెలిపారు. ఈ చర్యలను పౌర హక్కుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సాధారణ జీవితం గడుపుతున్న రవి శర్మను పోలీసులు మళ్లీ మళ్లీ దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రచయిత జర్నలిస్ట్ ఎడిటర్ అయిన ఎ.వేణుగోపాల్ ఇంటి పైన కూడా అదే సమయంలో ఎన్ఐఏ దాడి చేశారని తెలిపారు.

బస్‌షెల్టర్లు ఎక్కడ?

పెరుగుతున్న ఎండలతో ప్రయాణికుల పరేషాన్


బస్ షెల్టర్లు లేక రోడ్డు మీదనే నిల్చున్న ప్రయాణికులు, బస్టాపుల్లో తిష్టవేసిన ఆటోలు

నాంపల్లి: బస్టాపుల్లో బస్ షెల్టర్లు కరువయ్యాయి. బస్ షెల్టర్లు లేని కారణంగా ప్రయాణికులు రోడ్డు మీదనే నిల్చుంటున్నారు. గమ్యానికి చేర్చాల్సిన ఆర్టీసీ బస్సు మరింత ఆలస్యమైతే కాసేపు కూర్చునే వెసులుబాటు లేకుండా పోయింది. బస్సు ఎక్కి దిగేటప్పుడు ప్రయాణికులు బస్ షెల్టర్లను ఆశ్రయిస్తారు. ఎండ, వానల నుండి రక్షణ పొందడానికి ఇవి ఎంతగానో దోహదపడుతాయి. కానీ టీఎస్ఆర్టీసీ బస్టాపుల్లో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రయాణికులు అనేక రకాల అవస్థలు పడుతున్నారు. నాంపల్లి నియోజకవర్గంలోని మెహిదీపట్నంలో ఈ సమస్య అధికంగా ఉంది. మెహిదీపట్నంతో పాటుగా మాసబ్‌ట్యాంక్, మల్లేపల్లి, సీతారామ్‌భాగ్, దారుస్సలాం, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మెహిదీపట్నం డిపో పరిధిలో అత్యధికంగా బస్టాపులు ఉన్నాయి. ఈ బస్టాపుల్లో సౌకర్యాలు లేవు. ప్రధానంగా బస్ షెల్టర్ల ఏర్పాటుతో పాటుగా కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేయాలి. ఆదాయాన్ని ఇచ్చే బస్టాండ్లలో కూడా సౌకర్యాలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. టీఎస్ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాబట్టి ఇప్పటికైనా బస్టాపుల్లో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సులు ఆగాల్సిన చోట ఆటోల తిష్ట..

మెహిదీపట్నం ప్రాంతంలో బస్టాపుల సంఖ్య అధికంగా ఉంది. పాత ముంబాయి హైవే కావడం, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చేవేళ్ల, వికారాబాదు, తాండూరు, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు మెహిదీపట్నం బస్టాపులు అనుకూలంగా ఉంటున్నాయి. దీనికి తోడు మెహిదీపట్నం నుండి నగరం నలువైపులా ఉండే ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. కాబట్టి ఇక్కడి నుంచి వందలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు చేరుకునేందుకు మెహిదీపట్నం బస్టాపులను ఆశ్రయిస్తుంటారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన మెహిదీపట్నం బస్టాపుల్లో ఆర్టీసీ బస్సులు ఆగాల్సి ఉంది. కానీ ఇక్కడ ఆటోలు తిష్టవేస్తున్నాయి. బస్టాపుల్లో ఆటోలు నిల్పోవడం చేత ఆర్టీసీ బస్సులు నడి రోడ్డు మీదనే నిల్పోబెడుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. బస్టాపుల్లో ఆగుతున్న ఆటోలను నిరోధించడానికి ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య పూజలు


అన్నదానం నిర్వహిస్తున్న మాడిశెట్టి సదానందం గుప్తా, ఉప్పల శ్రీనివాస గుప్తా తదితరులు

అబిడ్స్: ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ ఆధ్వర్యంలో అమావాస్య పూజలు నిర్వహించారు. శుక్రవారం గోశాలల్లో పెద్ద ఎత్తున గోపూజలు, గోపోషణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలిండియా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాడిశెట్టి సదానందం గుప్తా, పర్యాటక మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, అధ్యక్షులు గుండా సురేష్‌గుప్తా, యాదగిరి గుప్తా, గోవింద్ గుప్తా, ధనుంజయ్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, రాధాకృష్ణ గుప్తా, మాడం మధుసుధన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య కళాకారులను గుర్తించాలి


డాక్టర్ కె.వరప్రసాద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ : వంశీ ఇంటర్నేషనల్ – ఇండియా సంస్థల ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ.రమణాచారి జన్మదిన వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సహస్రవధాన్ని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్‌కు కేవీ.రమణ జాతీయ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో సినీ నటుడు తనికెళ్ల భరణి, కిమ్స్ ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణయ్య, తిరుమల బ్యాంక్ చైర్మన్ ఎన్.చంద్రశేఖర్, సంస్థ వ్యవస్థాపకులు వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

అద్భుత చిత్రాల ఆవిష్కరణ

ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న చిత్రాలు







నాంపల్లి: జేఎన్టీయూ కళాశాల చిత్రలేఖన శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల కళాఖండాల ప్రదర్శన మాసబ్‌ట్యాంక్ జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమైంది. ఏడాది పాటు విద్యార్థులు నేర్చుకున్న విద్యాత్మక అంశాలను తమ కళా రూపాల ద్వారా ప్రదర్శలో ఉంచారు. మన చుట్టూ ఉండే వ్యర్థాలతో ఆవిష్కరించిన వైవిధ్యాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రత్యేక రాష్ట్రం, ప్రాముఖ్యత, పరిసరాలు, పర్యావరణం, వ్యవసాయం, ప్రకృతి దృశ్యాలు ఇలా ఒకటేమిటి ఎన్నో వస్తువులకు రూపమిచ్చారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 11వ తేదీ వరకు కొనసాగుతుంది. విద్యార్థులు ఆవిష్కరించిన వస్తువులను విక్రయానికి కూడా ఉంచారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఐఐఎంఆర్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పులిమామిడి రవీందర్, డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, ఎన్.స్వామి, రఘు మారెడ్డి, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు కాలీగ్రఫీ ప్రదర్శన

గోల్కొండ: విద్యార్థులకు కాలీగ్రఫీ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు కాలీగ్రఫీ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు వీనస్ విద్యా సంస్థల డైరెక్టర్ మహ్మద్ ఇదాయత్ ఆలీ ఖాన్ అన్నారు. శనివారం ఉదయం 9.30 గంటకు టోలిచౌకి డిలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్ ఆడిటోరియంలో ఈ ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు.

నైట్ షెల్టర్లు ఎక్కడ?


మెహిదీపట్నం ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న అనాథలు

గోల్కొండ: నిరుపేదలైన అనాథలు, వృద్ధులు, వికలాంగులు నైట్ షెల్టర్ అందుబాటులో లేక ఫుట్‌పాత్‌లనే ఆశ్రయిస్తున్నారు. మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్, ఆసిఫ్‌నగర్ రోడ్ తదితర ప్రాంతాల్లో అనాథ వృద్ధులు, వికలాంగులు భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసిన నైట్ షెల్టర్లు ఈ అనాథలకు అందుబాటులో లేవు. అసలు నైట్‌షెల్టర్లు ఉన్న విషయం కూడా వీరిలో చాలా మందికి తెలియదు. పగలంతా రోడ్లపై భిక్షాటన చేస్తూ వీరు ఫుట్‌పాత్‌లపై నిద్ర పోతున్నారు. మెహిదీపట్నం బస్టాప్‌కు ఆనుకోని ఉన్న ఫుట్‌పాత్‌లే వీరికి నైట్ అండ్ డే షెల్టర్లుగా పనికి వస్తున్నాయి. మెహిదీపట్నం బస్టాప్‌లకు ఆనుకొని వెనుక ప్రాంతంలో రక్షణ శాఖ వారి నివాసాలు, కార్యాలయం ఉంది. ఈ కారణంగా దానికి పటిష్టమైన కంచె, విశాలమైన చెట్లు కూడా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకోని అనాథలు ఈ ఫుట్‌పాత్‌లనే తమ ఇళ్లుగా మార్చుకున్నారు. వీరు ఫుట్‌పాత్‌లపై నిద్రపోతుండడంతో పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉదయం పూట రద్దీగా ఉండే బస్టాప్‌లు వాటిని ఆనుకోని ఉన్న ఫుట్‌పాత్‌లపై వృద్ధులు, వికలాంగులు నిద్రపోతుంటే రోడ్లపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తుందని ప్రయాణికులు వెల్లడిస్తున్నారు. వీరందరిని బల్దియా వారు ప్రభుత్వ సంక్షేమ గృహాలకు తరలించి రక్షణ కల్పించాలని పలువురు మానవతావాదులు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తాం


అసెంబ్లీకి బయలుదేరిన మజ్లిస్ ఎమ్మెల్యేలు

గోల్కొండ: ప్రజా వ్యతిరేక విధానాలను అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన మజ్లిస్ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారి తప్పుడు నిర్ణయాలను వ్యతిరేకిస్తామని ఆయన స్పష్టం చేశారు. మజ్లిస్ ఎమ్మెల్యేలు మహ్మద్ మాజీద్‌హుస్సేన్, ముబీన్ తదితరులున్నారు.

పని చేస్తున్న దుకాణానికే కన్నం

నిందితుడి అరెస్ట్...రూ.14.5 లక్షలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అదనపు డీసీపీ షేక్ జహంగీర్

చాంద్రాయణగుట్ట: తాను పని చేస్తున్న దుకాణంలో చోరీకి పాల్పడిన యువకుడిని మీర్‌చౌక్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.14.5 లక్షల నగదు, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. పురానీహవేలీలోని కార్యాలయంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్ వివరాలు వెల్లడించారు. అస్సాంకు చెందిన పంపన్ డోలే ఆరు నెలలుగా నూర్‌ఖాన్ బజార్‌లోని ట్రాక్టర్ల విడి భాగాల విక్రయ దుకాణం (ఝుంఝుం ఫాస్టనర్స్)లో కార్మికుడిగా పని చేస్తూ అదే భవనంలో పై అంతస్తులో నివాసం ఉంటున్నాడు. దుకాణంలో డబ్బులు ఎక్కడ దాచి పెడతారన్న విషయాన్ని గుర్తించిన అతను ఈ నెల 6న రాత్రి ఇనుప రాడ్‌తో గ్రిల్స్ తాళాన్ని బద్దలు కొట్టాడు. అనంతరం అదే రాడ్‌తో షట్టర్‌ను లేపి దుకాణంలో తాళాలు విరగొట్టి డ్రాలో దాచిన రూ.14.5 లక్షల నగదు చోరీ చేశాడు. మర్నాడు యజమాని అహ్మద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం నిందితుడిని జహీరాబాద్‌లో అరెస్ట్ చేశారు. సమావేశంలో మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు, ఇన్‌స్పెక్టర్ ఆర్.రవీందర్, డీఐ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అరవింద్‌కు టికెట్ ఇవ్వొద్దు

గన్‌ఫౌండ్రీ: బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు నిజామాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వవద్దు అంటూ శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట జగిత్యాల బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాతూ..... నిజామాబాద్ అరవింద్ గెలిచిన తర్వాత పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాలుగా పార్టీకోసం పనిచేస్తున్న నాయకులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అరవింద్‌కు టికెట్టు ఇస్తే ఓడిస్తామని హెచ్చరించారు. జగిత్యాలకు చెందిన సతీష్ అనే వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వెంటనే పార్టీ శ్రేణులు సతీష్‌ను అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పింది.

గాంధీ విగ్రహాన్ని పట్టించుకోండి


టోలిచౌకీలోని ప్రభుత్వ పాఠశాలలో గాంధీ విగ్రహం

గోల్కొండ: దశాబ్దాల క్రితం టోలిచౌకీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం నేడు ఆలనా పాలన లేకుండాపోయింది. అప్పట్లో టోలిచౌకీ చౌరస్తా వద్ద ఇప్పుడు ఉన్నంత ట్రాఫిక్ ఉండేది కాదు. అయితే రాను రాను టోలిచౌకీ చౌరస్తా నుంచి గచ్చిబౌలి, లింగంపల్లి, హకీంపేట్, గోల్కొండ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు విపరీతంగా పెరిగింది. దీనికి తోడు కబ్జాలు కూడా పెరిగిపోయాయి. ఈ కారణంగా గాంధీజీ విగ్రహం కాస్తా రోడ్డు దిగింది. రోడ్డును ఆనుకోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ప్రహరీ గోడ నిర్మాణ సమయంలో అధికారులు గాంధీ విగ్రహాన్ని తమ పాఠశాలలో కలుపుకున్నారు. దానికి గాంధీ విగ్రహం బయటవారికి కనబడకుండా ప్రహరీ నిర్మించారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి గాంధీ విగ్రహాన్ని నడిరోడ్డులో కాకపోయిన అక్కడ ఉన్న బస్టాప్ వద్దనైనా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌రెడ్డికి సన్మానం


అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో హార్టికల్చర్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. నూతనంగా నియమితులైన ఆయనను శుక్రవారం ముజీబ్‌హుస్సేని పుష్ప గుచ్ఛం అందజేసి సత్కారం చేశారు.

పురస్కారం ప్రదానం


ఆచార్య సి.మృణాళినికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బుర్రా సుబ్రమణ్యం శాస్త్రీ కళాపీఠం ఆధ్వర్యంలో ఆచార్య సి.మృణాళినికి బుర్రా సుబ్రమణ్య శాస్త్రి సాహిత్య పురస్కారాన్ని శుక్రవారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏపీ పాఠశాల విద్యాశాఖ పర్యావేక్షణ కమీషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరావు మాట్లాడుతూ.... సాహితీవేత్తలను ఎప్పటికప్పుడు మననం చేసుకోవాలని, వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం పాల్గొన్నారు.

నెమలినగర్‌లో గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెమలినగర్‌లో గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలనను విద్యుత్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మణికొండ విద్యుత్ శాఖ ఏఈ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కొన్ని దరఖాస్తుల్లో వారి సమాచారం అరకొరగా ఉందని, అయినా వారు గృహజ్యోతి పథకంపై టిక్ పెట్టడంతో వారి నుంచి మిగతా సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న కచ్చామోరీలు

కొత్త పైప్‌లైన్‌లు వేసినా పాతవాటిని తొలగించని వైనం



చార్మినార్: పాతబస్తీలోని నిజాం కాలం నాటి కచ్చామోరీలు, డ్రైనేజీ కాలువలు స్థానికులకు దడపుట్టిస్తున్నాయి. కొత్తగా పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయడంతో ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో వీటి వినియోగం తగ్గింది. నిరుపయోగంగా మారిన ఈ కచ్చామోరీలను పూర్తిగా తొలగించి మట్టితో పూడ్చాల్సిన అవసరం ఉంది. వీటిని శాశ్వతంగా పూడ్చకపోవడంతో ఇంకా అక్కడక్కడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఏ రోడ్డు కింద ఏ కచ్చామోరీ, డ్రైనేజీలున్నాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎక్కడ రోడ్డు కుంగిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన వాడకం... పట్టించుకోని అధికార గణం...

నిజాం కాలం నాటి కచ్చామోరీల స్థానంలో అక్కడక్కడా కొత్తగా పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తుండడంతో వీటి వాడకం తగ్గింది. కచ్చామోరీలకు పైకప్పులుగా అప్పట్లో రాళ్ల కడ్డీలను వినియోగించారు.వీటిని సాధారణంగా వరద నీరు వెళ్లడానికి వినియోగించేవారు. అక్కడక్కడ డ్రైనేజీలుగా కూడా వాడుతున్నారు. ప్రస్తుతం వీటి స్థానంలో చాలా ప్రాంతాల్లో కొత్తగా పైప్‌లైన్‌లను అందుబాటులోకి తెచ్చిన జీహెచ్ఎంసి, జలమండలి అధికారులు పాత వాటిని అలాగే వదిలేసారు. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని వెంటనే గుర్తించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

గతంలో జరిగిన సంఘటనలు...

- మొఘల్‌పురా హాఫీజ్ డంకా మసీదు ముందున్న రోడ్డు ఒక్కసారి కుంగిపోయింది. నిజాం కాలం నాటి డ్రైనేజీకు అనుసంధానంగా ఈ గొయ్యి ఏర్పడడంతో అటువైపు నుంచి ద్విచక్ర వాహనంపై తలాబ్‌కట్టకు వెళుతున్న ఇద్దరు యువకులు ప్రమాదానికి గురయ్యారు. దీనికి తాత్కాలిక మరమ్మతులు చేసారు.
- తలాబ్‌కట్టాలోని భవానీనగర్‌లోని పురాతన కచ్చామోరీ ఉన్నట్టుండి ఒక్కసారి కిందికి కుంగిపోయింది. ఈ కచ్చామోరీ వాడుకలో లేదు.
- పాతబస్తీ చేలాపురా చౌరస్తా నడిరోడ్డులో ఒక్కసారిగా రోడ్డు కుంగిపోయింది. దాదాపు 10 మీటర్ల పొడవు రోడ్డంతా లోనికి పడిపోవడంతో కింద సొరంగం ఉండవచ్చునని అందరూ భావించారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ జోనల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని సొరంగాన్ని పరిశీలించారు. నిజాం కాలంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువ అని నిర్ధారించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గౌలిపురా: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆలే జితేంద్ర మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకం ప్రతి ఒక్క ఇంటికీ అందే విధంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలందరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎస్.వీరేంద్ర బాబు యాదవ్ పాల్గొన్నారు.

గోల్కొండలో డ్రైనేజీ పూడికతీత పనులు


పూడికతీత పనులు పరిశీలిస్తున్న మజ్లిస్ నాయకులు సిద్దీఖ్

గోల్కొండ: డ్రైనేజీలు పొంగిపొర్లకుండా ఎప్పటికప్పుడు వాటికి పూడికతీత పనులు చేయిస్తున్నామని మజ్లిస్ నాయకుడు సిద్దిఖ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ సాలె నగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు చోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ దెబ్బతిన్నాయని వాటిని తొలగించి కొత్తవి వేస్తున్నామని అన్నారు.

గోవధపై కఠిన చర్యలు తీసుకోవాలి


గోశాలలో గోవులకు ఆహారం అందజేస్తున్న ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం గోషామహల్‌లో గోమాత పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో గోవులకు వివిధ ఆహారాన్ని అందించారు. అదేవిధంగా భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో గోమాతలకు గోమాత పూజలు నిర్వహించి వాటికి పప్పుధాన్యాలు అందజేశారు.

బీజేపీ నేతల బస్తీబాట


బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గౌలిపురా: బీజేపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బస్తీబాట కార్యక్రమాన్ని సీనియర్ నాయకులు శక్తి కేంద్ర ప్రముఖ్ భాను ప్రకాశ్ అవ్వల్‌కార్ ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి యాకుత్‌పురా కంటెస్టెడ్ ఎమ్మెల్యే వీరేంద్రబాబు యాదవ్ పాల్గొన్నారు.